క్లుప్తంగా

120 మందికి వైద్య పరీక్షలు



వైద్య సేవలందిస్తున్న డాక్టర్ శశిధర్

పొందూరు: మండలంలోని లచ్చియ్యపేట గ్రామంలో శ్రీకాకుళం పట్టణానికి చెందిన డాక్టర్ శశిధర్ హాస్పటిల్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామానికి చెందిన సుమారు 120 మందికి డాక్టర్ అన్నెపు శశిధర్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

కొత్తూరు: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు యూత్ ఫర్ సేవా సంస్థ సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ను సమాజ్ పరివర్తన్ సంస్థ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.నరేష్ బుధవారం అందజేశారు. ఎన్‌ఎంఎంఎస్‌కు అవసరమైన స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ మెటీరియల్‌ను విద్యార్థులు వినియోగించుకోవాలని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. హెచ్‌ఎం ఎ.గోవిందరావు, సంస్థ కమిటీ సభ్యులు చందరరావు, వెంకటరావు, తిరుపతిరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాణ్యత తప్పనిసరి

జలుమూరు: మధ్యాహ్న భోజనంలో నాణ్యత తోపాటు శుచి, శుభ్రత మోనూ కచ్చితంగా పాటించాలని ఎంఈఓ బి.మాధవరావు అన్నారు. బుధవారం తమ్మయ్యపేట కాలనీ ప్రాథమిక పాఠశాల తనిఖీ నిర్వహించి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. విద్యా సామర్థ్యాలను పరిశీలించారు.

పుస్తకావిష్కరణ..



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

కొత్తూరు: గణిత దీప్తి పుస్తకాన్ని కడుము జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గొర్లె తిరుమలరావు, గణిత ఉపాధ్యాయులు సునీల్ వెంకట భాస్కరరావు బుధవారం పాఠశాలలో ఆవిష్కరించారు. పాఠశాలకు చెందిన గణిత ఉపాధ్యాయులు పడాల సునీల్, గేదెల వెంకట భాస్కరరావు ఉమ్మడిగా గణిత దీప్తి పుస్తకాన్ని రూపొందించినట్లు హెచ్‌ఎం చెప్పారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో గణితంలో ఉత్తమ ఫలితాల సాధన కోసం గణిత దీప్తి ఎంతగానే దోహద పడుతుందన్నారు. గణితం విశిష్టను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల పరిశీలన



విద్యార్థులతో మాట్లాడుతున్న వృత్తి విద్యాశాఖాధికారి తవిటినాయుడు

సరుబుజ్జిలి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను పటిష్ఠం చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని ఇంటర్మీడియెట్ జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి శివ్వాల తవిటినాయుడు తెలిపారు. కళాశాలను బుధవారం సందర్శించారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ కళాశాలను అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. ప్రిన్సిపాల్ ఎం.నాగేంద్ర, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ రమేష్ సాహు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన

సారవకోట: మండలంలోని గొర్రిబందలో బుధవారం బ్రెడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గిరిజనులకు సచివాలయ సచివాలయ సిబ్బంది ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. సంస్థ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ రమణ ఆధ్వర్యంలో కోనవానిపేట, రైవాడ, జగన్నాథపురం, ఎగువ బురుజువాడ గ్రామాల్లోని గిరిజనుల సమస్యలను సచివాలయ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఎలా దరఖాస్తు చేసుకోవాలి, పథకాలు వర్తించకపోతే ఏం చేయాలి, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి విష్ణువర్ధన్, ఎంపీటీసీ పల్లి కృష్ణారావు, బ్రెడ్స్ సంస్థ సభ్యులు ధర్మారావు, సంజీవరావు, రామచందరరావు పాల్గొన్నారు.

సకాలంలో మందులు వేయించాలి

సరుబుజ్జిలి: గొర్రెలు, మేకల పెంపకందారులు నట్టల నివారణ మందులు సకాలంలో వేయించాలని పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సి.హెచ్.సుబ్రహ్మణ్యం తెలిపారు. మండలంలోని కొత్తకోట, దకరవలస గ్రామాల్లో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందుల శిబిరాన్ని బుధవారం ప్రారంభించారు. 400 గొర్రెలు, 80 మేకలకు నట్టల నివారణ మందులు వేసినట్లు ఏడీ తెలిపారు. ఈ నెల చివరి వరకు జరగనున్న ఈ కార్యక్రమాన్ని పెంపకందారులు వినియోగించుకోవాలన్నారు.

ఏదీ ‘చెత్త’ శుద్ధి

- నిరుపయోగంగా ఉన్న చెత్త సంపద కేంద్రాలు
- గ్రామాల్లో కానరాని స్వచ్ఛత ..
- వర్మీ, సేంద్రియ ఎరువుల తయారీ ఎప్పుడు?
- పర్యవేక్షణ కరువు..

ఆమదాలవలస నియోజకవర్గంలో చెత్త సంపద కేంద్రాల వివరాలు ఇలా..

మండలం	మంజూరైన ఎస్‌డబ్ల్యూపీసీలు	పూర్తయినవి
సరుబుజ్జిలి	21	20
ఆమదాలవలస	30	28
బూర్జ	28	26
పొందూరు	32	30



నిరుపయోగంగా ఉన్న యరగాం ఎస్‌డబ్ల్యూపీసీ



సరుబుజ్జిలి కాంప్లెక్స్ సమీపంలో పేరుకుపోయిన చెత్త

సరుబుజ్జిలి: స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించి పంచాయతీల ఆదాయాన్ని పెంచేందుకు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను (ఎస్‌డబ్లుపిసి) ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆశించిన స్థాయిలో ప్రగతి కనిపించడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాలను స్వచ్ఛంగా ఉచ్చేందుకు పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టినా.. ఎక్కడా శుభ్రత కనిపించడం లేదు. ఆమదాలవలస నియోజకవర్గంలోని సరుబుజ్జిలి, బూర్జ, పొందూరు, ఆమదాలవలస మండలాల్లో 110 పంచాయతీల్లో చెత్త సంపద తయారీ కేంద్రాలు మంజూరు చేయగా.. 104 కేంద్రాలు నిర్మించారు. ఆరు కేంద్రాలు వివిధ దశల్లో ఉన్నాయి. జనాభా ప్రాతిపదికన స్వచ్ఛ భారత్ నిధుల నుంచి ఒక్కో యూనిట్‌కు రూ.4 లక్షల నుంచి రూ.9 లక్షల వరకు నిధులు మంజూరుచేసి నిర్మాణాలు చేపట్టారు. ఒకటి, రెండు చోట్ల తప్ప ఎక్కడా ఎస్‌డబ్ల్యూపీసీలు పూర్తిస్థాయిలో పనిచేసిన దాఖలాలు లేవు.

ఎస్‌డబ్ల్యూపీసీల ముఖ్య ఉద్దేశం..

గ్రామాల్లో గ్రీన్ అంబాసిడర్లు ప్రతీ ఇంటికి వెళ్లి తడి, పొడి చెత్తతోపాటు, వీధుల్లోని చెత్తను సేకరించి రిక్షాలు ద్వారా కేంద్రాలకు తరలించాలి. అక్కడి తడి, పొడి చెత్తను వాటికి కేటాయించిన కుండీల్లో నిల్వ చేయాలి. నిల్వ చేసి వాటితో వర్మీకం పోస్టు, సేంద్రియ ఎరువులు తయారుచేసి రైతులకు తక్కువ ధరలకు విక్రయించాలి. గ్రామాల్లో ప్లాస్టిక్, స్క్రాప్, వ్యర్థ పదార్థాలను దుకాణాలకు విక్రయించి పంచాయతీల అదనపు ఆదాయాలను పెంచాలన్నదే ఈ కేంద్రాల ముఖ్య ఉద్దేశం

ఎరువులు తయారుచేయాలి



ఎస్‌డబ్ల్యూపీసీలను పేరుకే నిర్మించారు. వాటిలో వర్మీకం పోస్టు, సేంద్రియ ఎరువులు తయారీ జరగడంలేదు. చాలా కేంద్రాల్లో తడి, పొడిచెత్త వేరు చేయడం లేదు. కేంద్రాల ఏర్పాటు వల్ల ప్రయోజనం లేదు.

– ఎస్.రాజారావు, పీఎంపేట, సరుబుజ్జిలి మండలం

వినియోగంలోకి తెస్తాం

ఎస్‌డబ్ల్యూపీసీలను తనిఖీ చేస్తాం. సక్రమంగా పనిచేయని వాటిని వినియోగంలోకి తీసుకు రావడం జరుగుతుంది. సేంద్రియ ఎరువు, వర్మీ కంపోస్టు తయారీకి చర్యలు తీసుకుంటాం . ఎరువులను రైతులకు విక్రయించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తాం.

– బి.రామారావు, ఈఓపీఆర్డీ, సరుబుజ్జిలి

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి



మాట్లాడుతున్న ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణగా ఉంటూ విద్యపై దృష్టి సారించాలని మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ అన్నారు. స్థానిక ధర్మాన రామలింగన్నాయుడు (డీఆర్‌ఎన్) కళాశాల ఏర్పడి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కళాశాల ఆవరణలో బుధవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కృష్ణదాస్ మాట్లాడుతూ విద్యతోపాటు నైపుణ్యత కూడా అవసరమన్నారు. విద్యార్థి దశలో సరదాలు అవసరమేనని, అయితే స్మృతి మించకూడదని అభిప్రాయపడ్డారు. ఒకమంచి ఆశయంతో డిగ్రీ కళాశాలను మా నాన్న పేరున ఏర్పాటు చేశామన్నారు. దీంట్లో చదువుకున్న ఎంతోమంది ఉన్నత స్థాయిల్లో ఉన్నారన్నారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు జ్ఞాపికలు అందించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ గోవిందరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థ నిర్వీర్యం

- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ప్రైవేట్ కాలేజీల్లో ఇంజినీరింగ్ వంటి ఉన్నత చదువులు చదువుతున్న విద్యార్థులకు చెల్లించే ఫీజులు ప్రభుత్వం విడుదల చేయకపోవటంతో తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడుతోందని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సరైన సమయంలోనే విద్యార్థులకు విద్యా దీవెన, వసతి దీవెన వంటి పథకాలను చెల్లించి, విద్యార్థుల ఉన్నత చదువులకు మంచి బాటలు వేశారని గుర్తుచేశారు. చంద్రబాబు అధికారం చేపట్టిన తరువాత విద్యార్థులకు ఫీజులు చెల్లించటం లేదన్నారు. ఆయా కాలేజీ యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలని విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నాయన్నారు. 2024–25 విద్యా సంవత్సరం ప్రారంభమై సుమారు ఐదు నెలలు అవుతుందన్నారు. ఇప్పటివరకు తల్లికి వందనం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. తల్లులను మోసం చేసిన ఘనత చంద్రబాబుకు దక్కిందని ఆరోపించారు. నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలల్లో అత్యాధునికమైన మరుగుదొడ్లును తమ ప్రభుత్వం నిర్మించిందన్నారు. మానవవనరులపై పెట్టుబడి, భావి తరాల భవితకు బలమైన పునాది అని నమ్మిన జగన్‌మోహన్‌రెడ్డి గత ఐదేళ్ల పాలనలో జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా 29,65,930 మంది విద్యార్థులకు రూ.12,610 కోట్లు చెల్లించారని వివరించారు. జగనన్న అమ్మ ఒడి, విద్యా కానుక, గోరుముద్ద, పాఠశాలల్లో నాడు–నేడు, విద్యా దీవెన, వసతి దీవెన వంటి పథకాలను అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు.

ఫిర్యాదులు వస్తే చర్యలు

- డ్వామా పీడీ సుధాకరరావు



మాట్లాడుతున్న డ్వామా పీడీ సుధాకరరావు

ఆమదాలవలస: ఉపాధి హామీ పథకం సిబ్బంది మండ, క్షేత్రస్థాయిలో సమన్వయంతో విధులు నిర్వహించాని డ్వామా పీడీ బి.సుధాకరరావు సూచించారు. బుధవారం మండల కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. సిబ్బంది పనితీరుపై ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా చర్యలు తప్పవని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో ఎటువంటి అక్రమాలు జరిగినా కఠినంగా చర్యలు తీసుకుంటామన్నారు. పని కోరిన వారందరికీ ఉపాధిని కల్పించాలన్నారు. పని ప్రదేశాల్లో వేతనదారుల సంఖ్యను పెంచాలన్నారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్లాంటేషన్ పనులను త్వరితగతిన శత శాతం పూర్తిచేయాలని, నాటిన ప్రతీ మొక్క క్షేత్రస్థాయిలో ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. వ్యక్తిగత తోటల పెంపకం పట్ల రైతులకు అవగాహన కల్పించాలన్నారు. గరిష్ఠ వేతనం వచ్చేలా పనులను చేపట్టాలని, పనుల్లో నాణ్యతకు అధిక శాతం ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఏపీఓ అప్పలనరసమ్మ, ఈసీ జి.రాము, టెక్నికల్ అసిస్టెంట్లు సత్యనారాయణ, సుధాకర్, క్షేత్ర సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలపై దాడులు పెరిగాయి

- ప్రభుత్వాలపై తీరుపై శ్రామిక మహిళా సంఘం ధ్వజం



నిరసన తెలుపుతున్న శ్రామిక మహిళా సంఘం ప్రతినిధులు

నరసన్నపేట: మహిళలపై దాడులు, అత్యాచారాలు, హత్యలు బాగా పెరిగిపోతున్నాయని, వీటిని నివారించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలయ్యాని శ్రామక మహిళా సంఘం ధ్వజమెత్తింది. నరసన్నపేట ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో శ్రామిక మహిళా సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ కె.నాగమణి, కో– కన్వీనర్ ఎ.మహాలక్ష్మి మాట్లాడారు. రోజురోజుకీ మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని, బయటకు రావాలంటే భయం వేస్తోందని, మహిళలకు పూర్తిగా రక్షణ లేకుండా పోయిందన్నారు. ఒక ఘాతుకం మరిచిపోకముందే మరోకటి చోటు చేసుకుంటుందన్నారు. జిల్లాలో కూడా ఇటువంటివి జరుగుతున్నాయంటే ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమన్నారు. మహిళలపై నేరాలు ఇంతగా పెచ్చుమీరడానికి, ఉన్మాదులు యథేచ్ఛగా చెలరేగడానికి ప్రధాన కారణం నేరం చేయకూడదన్న భయం లేకపోవడమేనన్నారు. కేసుల్లో అరెస్టులు, దర్యాప్తు, శిక్ష వెంటవెంటనే అమలయ్యేలా చర్యలు ఉండాలన్నారు. ప్రభుత్వాలు నిద్ర మాని మహిళలపై జరుగుతున్న దాడులను నిరోధించడానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం ప్రతినిధులు ఎ.రాధ, కాంతమ్మ, లక్ష్మీ, జ్యోతి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

కుళాయి బాగుచేశారు..



కుళాయిని బాగుచేస్తున్న పంచాయతీ సిబ్బంది

పొందూరు: స్థానిక జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఆదేశాల మేరకు పొందూరు ఎస్సీ బాలికల వసతి గృహంలో తాగునీటి కుళాయిని పంచాయతీ ఈఓ మోహన్‌బాబు బుధవారం బాగు చేయించారు. ఇటీవల జడ్జి బి.జ్యోత్స్న ఎస్సీ బాలికల వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థులు, సిబ్బందితో మాట్లాడారు. తాగునీటి ఇబ్బందులను జడ్జి దృష్టికి విద్యార్థులు తీసుకువచ్చారు. జడ్జి ఆదేశాల మేరకు పంచాయతీ సిబ్బంది కుళాయిని బాగుచేశారు.

బాధ్యతల స్వీకరణ



వసంతకుమారి

కొత్తూరు: స్థానిక ఈఓపీఆర్డీగా ఎస్.వసంతకుమారి బుధవారం విధుల్లో చేరారు. వసంతకుమారి రాజాం మండలం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇంతవరకు కార్యాలయం ఏఓ రాంబాబు ఇన్‌చార్జి ఈఓపీఆర్డీగా బాధ్యతలు నిర్వహించారు.

బాల్య వివాహాలపై అవగాహన

పాతపట్నం: బాల్య వివాహాలపై గ్రామాల్లో కల్పించాలని జిల్లా బాలల రక్షణాధికారి (ఐసీపీఎస్) ఎం.మల్లేశ్వరరావు అన్నారు. పాతపట్నం ఐసీడీఎస్ కార్యాలయంలో పాతపట్నం, మెళియాపుట్టి మండలాల ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలతో బుధవారం సమావేశం నిర్వహించారు. మల్లేశ్వరరావు మాట్లాడుతూ బాలల రక్షణపై అన్ని గ్రామ పంచాయతీల్లోనూ, వసతి గృహాల్లోనూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బాల్య వివాహాల నిరోధక, బాలల రక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతీ అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో కిశోర బాలికల సంఘాలను ఏర్పాటు చేసి, వారిని కాపాడుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. అనాధికార దత్తత వల్ల కలిగే నష్టాలు, స్పాన్సర్‌షిప్ పథకం, పోస్టల్, ఆఫ్టర్ కేర్‌లపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సీడీపీఓ విమలారాణి, సూపర్‌వైజర్లు జి.అనురాధ, డి.అమరావతి పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు వినతుల వెల్లువ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

హిరమండలం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ప్రజాదర్బార్‌ను నిర్వహించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాల్సిన కార్యక్రమం మధ్యాహ్నం 12 గంటలకు ఎమ్మెల్యే ప్రారంభించారు. పింఛన్లు, రేషన్‌కార్డులు, కాలనీ ఇళ్లు మంజూరుచేయాలని అధిక సంఖ్యలో వినతులు వచ్చాయి. హిరమండలం గ్రామ పంచాయతీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మీసాల రామకృష్ణ వినతిపత్రం అందించారు. రెండు దశాబ్దాల క్రితం వంశధార కుడి ప్రధాన కాలువ నిర్మాణ సమయంలో కోరాడ రెవెన్యూ పరిధిలోని సుభలయ రైతులకు అప్పటిప్రభుత్వం భూమి కేటాయించదన్నారు. ఆ భూములకు 1బీలు, అడంగల్ రాకపోవడంతో రైతులకు రుణాలు, సంక్షేమ పథకాలు అందడంలేదని, క్రయవిక్రయాలు కూడా చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. మండల ప్రత్యేకాధికారి రాజగోపాల్, ఎంపీడీఓ కాశీప్రసాద్, తహసీల్దార్ హనుమంతురావు, జెడ్పీటీసీ సభ్యుడు బుచ్చిబాబు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు తూలుగు తిరుపతిరావు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రమాదకరం



నరసన్నపేట మండలం కోమర్తి పంచాయతీ లకిమేరలో మంచి నీటి ట్యాంక్‌కు ఆనుకుని గతంలో నిర్మించిన ఇనుప నిచ్చెన ప్రమాదకరంగా ఉంది. నిచ్చెన తుప్పు పట్టి ఏ క్షణాన విరుగుతుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. నిచ్చెన చుట్టూ జంగిల్ కూడా అధికంగా ఉంది. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– నరసన్నపేట

గోతులమయం



సారవకోట మండలంలోని వడ్డినవలస–కొమనాపల్లి నుంచి తర్లి వెళ్లే రహదారి గోతుల మయంగా తయారైంది. సుమారు 2 కిలో మీటర్ల మేర ద్విచక్ర వాహనం సైతం వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయింది. ఈ గ్రామంలో గిరిజన ఆశ్రమ పాఠశాల ఉండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు, జీసీఎంఎస్ నుంచి సరుకులు తీసుకుని వచ్చేవారు ఇబ్బంది పడుతున్నారు. ఐటీడీఏ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– సారవకోట

సాగునీటి కష్టాలు



ఈ చిత్రం కొత్తూరు మండలం మదనాపురం వద్ద వరి పంటకు ఆయిల్ ఇంజిన్ ద్వారా పెడ తున్న సాగునీరు. మండలంలో వరి పంట వర్షాధారం కావడంతో నాటునీటి కష్టాలు మొదలయ్యాయి. 15 రోజుల నుంచి వర్షాలు లేవు. పంట చేతికి వస్తున్న తరుణంలో నీటి ఎద్దడి ఏర్పడింది. చెరువులు, వంశధార నది నుంచి ఇంజిన్లు, బోర్లు ద్వారా వరి పంటకు నీటిని పెట్టి బతికించుకుంటున్నారు.

– కొత్తూరు

మూలకు చేరాయి



ఈ చిత్రం హిరమండలం మండల పరిషత్ ఆవరణంలో మూలకు చేరిన చెత్త సేకరణ రిక్షాలు. స్వచ్ఛ భారత్ కింద మంజూరైన ఈ రిక్షాలు మరమ్మతులకు గురయ్యాయి. మరి కొన్ని గ్రామాల్లో సంపద కేంద్రాల వద్ద నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. మరమ్మతులు చేసి రిక్షాలను వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

– హిరమండలం

ఫ్లెక్సీల చించివేత



జనసేన ఫ్లెక్సీని చించేసిన గుర్తుతెలియని వ్యక్తులు

మెళియాపుట్టి. మండలంలోని తూముకొండ గ్రామం అకులమ్మ తల్లి ఆలయం మలుపులో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, నియోజకవర్గ నాయకురాలు కొరికాన భవానీ ఫొటోలతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను మంగళవారం గుర్తుతెలియని వ్యక్తులు చించివేశారు. దీనిపై స్థానిక పోలీసులకు జనసేన మండల నాయకులు ఫిర్యాదు చేశారు. ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడటం తగదని బాలరాజు అన్నారు. గత నెల 1వ తేదీన మెళియాపుట్టి మండల కేంద్రంలోని మహేంద్రతనయ నది వంతెన సమీపంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు సైతం చింపివేశారన్నారు. అప్పుడు కూడా పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. మళ్లీ అటువంటి సంఘటనే జరగడం, కేవలం జనసేన ఫ్లెక్సీలు మాత్రమే చించివేస్తున్నారన్నా. పోలీసులకు ఫిర్యాదు చేసిన వారిలో క్రాంతికుమార్, పిట్ట హరి కృష్ణ, చంటి తదితరులు ఉన్నారు.

రూ.లక్ష అందజేస్తాం..

జనసేన ఫ్లెక్సీలు చించినవారి ఆచూకీని ఎవరైనా తెలియజేస్తే వారికి రూ.లక్ష అందజేస్తామని పాతపట్నం నియోజకవర్గ జనసేన నాయకురాలు కొరికాన భవానీ ప్రకటించారు.

సంక్షిప్తంగా...

డిసెంబర్ నాటికి పనులు పూర్తిచేయాలి

సరుబుజ్జిలి: ఉపాధి హామీ ద్వారా గ్రామాలకు మంజూరైన సీసీ రోడ్లు, కాలువ పనులు డిసెంబర్ చివరి నాటికి పూర్తిచేయాలని ఎంపీడీఓ ఎం.పావని తెలిపారు. మండలంలోని తెలికిపెంటలో రూ.80 లక్షల నిధులతో మంజూరైన సీసీ రోడ్లు, కాలువ పనులకు స్థానిక నేతలతో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. సర్పంచ్ నందివాడ రాజ్యలక్ష్మి, నందివాడ గోవిందరావు, శివ్వాల సూర్యనారాయణ, అంబళ్ల రాంబాబు పాల్గొన్నారు.

విద్యా సామర్థ్యాలు పెంచాలి

నరసన్నపేట: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదుతువున్న విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలు పెంచాలని, దీనిపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని నరసన్నపేట ఎంఈఓ శాంతారావు అన్నారు. మండలంలోని రెడ్డికిపేట ప్రాథమిక పాఠశాలను బుధవారం తనిఖీ చేశారు. విద్యా ప్రమాణాలను పరిశీలించారు. మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందని హెచ్‌ఎం జ్యోతికి సూచించారు. మధ్యాహ్న భోజన పథకంపై ఆరా తీశారు.

ఐక్యతతోనే హక్కుల సాధన

ఆమదాలవలస: బ్రాహ్మణులంతా ఐక్యతతో ఉంటేనే హక్కుల సాధన సాధ్యం అవుతుందని శ్రీవేద గాయత్రి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు బలివాడ రాజేష్ శర్మ అన్నారు. ఆమదాలవలస పట్టణంలో బుధవారం వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రానున్న కార్తీక మాసంలో సంఘం ద్వారా చేపట్టాల్సిన సామాజిక సేవా కార్యక్రమాలపై చర్చించినట్లు తెలిపారు. పేద బ్రాహ్మణుల అభ్యున్నతికి సంఘం ద్వారా కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో సంఘం కార్యవర్గ సభ్యులు కత్రి రవిప్రసాద్, అంపోలు రామాచార్యులు, పి.శంకరరావు, ఎస్.మహేష్, సంతోష్‌బాబు పాల్గొన్నారు.

రాజీయే రాజమార్గం

నరసన్నపేట: స్థానిక కోర్టు పరిధిలో ఉన్న క్రిమినల్, సివిల్ కేసులను కక్షిదారులు రాజీచేసుకోవాలని నరసన్నపేట కోర్టు జూనియర్ సివిల్ జడ్జి సి.హెచ్.హరిప్రియ అన్నారు. డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని, ఈ లోగా కక్షిదారులకు అవగాహన కల్పించాలని న్యాయవాదులు, పోలీసులకు సూచించారు. బుధవారం కోర్టు పరిధిలో ఉన్న పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకుంటే కక్షిదారులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.

హాస్టల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన

హిరమండలం: మండలంలోని గొట్ట పంచాయతీ గొట్టలక్ష్మీపురం గ్రామ సమీపంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.2.30 కోట్లతో ప్రధానమంత్రి జన్మన్ హాస్టల్ భవన నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు ఇది మంచి అవకాశమన్నారు. సమగ్ర శిక్షణ ఈఈ మూర్తి మాట్లాడుతూ గిరిజన విద్యాభివృద్ధికి ఒకటి నుంచి పదో తరగతి వరకు 50 మంది విద్యార్థులకు వసతి సౌకర్యం కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ హాస్టల్‌ను మంజూరుచేసిందన్నారు. పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తుఫాన్‌పై అప్రమత్తం

పాతపట్నం: బంగాళాఖాతంలో ఏర్పడిన దానా తుఫాన్‌పై మండల అధికారులు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి మంచు కరుణాకరరావు ఆదేశించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం సమావేశం నిర్వహించారు. నదీ తీర ప్రాంతాల వీర్వోలు, పంచాయతీ సెక్రటరీలు అప్రమత్తంగా ఉండి, అధికారులకు సమాచారం అందించాలన్నారు. తహసీల్దార్ కిరణ్ కుమార్, ఎంపీడీఓ చంద్రకుమారి, ఈఓపీఆర్డీ మోహన్‌రావు, సెక్రటరీలు, వీఆర్వోలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పొందూరు: దానా తుఫాన్ పట్ల ప్రజలు అప్రమత్తగా ఉండాలని ఎంపీడీఓ మీసాల మన్మధరావు సూచించారు. కృష్ణాపురం, పొందూరు తదితర గ్రామాల్లోని సచివాలయాలను సందర్శించిన సిబ్బందిని అప్రమత్తం చేశారు. మండలంలోని వరి, మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లకుండా రైతులను అప్రమత్తం చేయాలని సూచించారు. ఈఓపీఆర్డీ సింహాచలం, ఏపీఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి లింగాల మధుబాబు, ఎంపీడీఓ నరసింహప్రసాద్ పండా అన్నారు. మండలంలోని చాపర గ్రామంలో పెద్దచెరువు గట్టును పరిశీలించారు. గ్రామ పరిసర ప్రాంతాలలో ఉన్న సెల్ టవర్లను పరిశీలించారు. కార్యదర్శి అప్పారావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ద్రోణాచార్య, సచివాలయ సిబ్బంది, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొత్తూరు: దానా తుఫాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ నీరజ సూచించారు. వంశధార నదికి అనుకుని ఉన్న మాతల పంచాయతీ పరిధి పెనుగోటివాడలో బుధవారం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. నది వైపు ఎవరూ వెళ్లకూడదన్నారు. సురక్షిత ప్రాంతానికి వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఈఓపీఆర్డీ వసంతకుమారి, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో సత్ఫలితాలు

హిరమండలం: మండలంలోని దివ్యాంగులకు ఫిజియోథెరపీ చేయిస్తే అంగవైకల్యం దూరమవుతుందని ఫిజియోథెరపిస్టు గ్రేసీశాంతి తెలిపారు. బుధవారం స్థానిక భవిత కేంద్రంలో చిన్నారులకు ఫిజియోథెరపీ చేశారు. వ్యాయామాలను ఇంటి వద్ద క్రమం తప్పకుండా చేయిస్తే సత్ఫలితాలు ఇస్తాయన్నారు. ఐఆర్టీలు సీతంనాయుడు, గోవిందరావు, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ టి.కేశవరావు తదితరులు పాల్గొన్నారు.